# అనగనగా... మనకథ

# నైజం

సూర్యుడు వెలగకముందు నుంచీ సుందరమ్మ బతుకుబండి మొదలవుతుంది! ఆయన కన్నా వేగంగా పరిగెడితేగానీ తన బతుక్కి సాయంత్రం రాదు.

వెళ్తూ వెళ్తూనే పూజారిగారి వాకిలి తుడిచి కల్లాపిజల్లి ముగ్గుగొట్టాం నాలుగు సార్లు తిప్పి..రయ్యిన పక్కవీధికి పరిగెడుతుంది. పక్కవీధిలో హెడ్‌మాస్టర్‌గారిల్లూ పెరడూ శుభ్రం చేసి నీళ్లు జల్లి..ముగ్గులు గీస్తుంది. ఇంక అక్కణ్ణుంచి...విశాలాక్షిగారింటికి వెళ్తుంది...అక్కడ ఇల్లు ఊడ్చి...ముగ్గేసేసరికి ఆవిడ పెద్ద కంచు గ్లాసుడు టీ ఇస్తుంది. దాంతో సుందరమ్మకి కొత్తశక్తి వస్తుంది.

మిగిలిన ఇళ్లలో వీధి పాచి చేస్తే ఇంకో ఐదు రూపాయలు ఎక్కువొస్తాయిగానీ..సుందరమ్మ ఒప్పుకోలేదు. కాదు- ఆ ఇంటివాళ్లే వప్పుకోలేదు. మొగుడు తలుపు తెరచి వీధిలోకి వచ్చేవేళ్టికి ముంగిట్లో ముగ్గుండాల్ట .మరి!!

విశాలాక్షిగారింట్లో టీ తాగంగానే తను వొప్పుకున్న ఐదారు ఇళ్లల్లో అంట్లు తోమడానికి బట్టలు ఉతకడానికి పరిగెడుతుంది. అక్కడా హడావుడీ ఉరుకులూ పరుగులూ తప్పవు- ఉద్యోగాలకెళ్లే మగాళ్లున్న ఇళ్లకి ముందెళ్లాలి!

అలాంటివాళ్ల ఇళ్లన్నీ వరసగా వుండవుకదా- ఆ వీధీ ఈ వీధీ పరిగెట్టాలి మరి- విశాలాక్షి మాత్రం సుందరమ్మ కష్టం తెల్సున్న మనిషి- అందర్లాగే పెంద్రాళే రావాలని షరతు పెట్టలేదు- 'నువ్వు నీ పనంతా అయాకే మా ఇంటికి రావే- నాకు వొండుకోడానికి వేరే గిన్నెలున్నాయిలే-' అని ప్రేమగా మాట్లాడుతుంది ఆవిడ!!

సుందరమ్మ నాలుగు నెలల క్రితం పెద్దమనిషై పైటేసిందిగానీ చాలా చిన్న పిల్ల! 13 ఏళ్లు వుంటాయేమో-

బక్కగా వున్నా చక్కగా వుంటుంది.

హాయిగా ఆడుతూ పాడుతూ చదువుకోవాల్సిన వయస్సులో ఇంత చాకిరీ చేస్తున్నందుకు విశాలాక్షి ఎప్పుడూ సుందరి గురించి బాధపడుతూ వుంటుంది- చేతనైనంతలో కన్నతల్లిలా సాయం చేస్తుంది!

సుందరమ్మకి కష్టం చేయకపోతే ఎలా కుదురుతుందీ? తల్లి సింతాలుకి, ఉన్నట్లుండి కుడికాలూ చెయ్యా పడిపోయాయి. మందులూ మాకులూ ఇప్పిస్తే కొంచెంగా కాలు నడవనిస్తోందిగానీ చెయ్యి స్వాధీనంలోకి రాలేదు. ఆవిడ పని చేస్తున్నంత కాలం సుందరమ్మకి కష్టం తెలీకుండా కొంగులో దాచుకుంది. ఇప్పుడు సుందరమ్మే కన్నతల్లికి తల్లైపోయింది.

సుందరమ్మ నాన్న శివుడు లేచినప్పణ్నుంచీ కల్లుపాకలోనే పడిచస్తాడు- ఇంటికొచ్చి తూల్తూ పేల్తూ నానా హడావుడీ చేస్తాడు- పెళ్లాం మంచాన పడినప్పణ్నుంచీ వాడికి హద్దూ అపూ లేకుండా పోయింది-

ఈమధ్యకాలంలో కూతురు పెళ్లీడుకొచ్చిందని వాళ్లదగ్గరా వీళ్లదగ్గరా అప్పులు చేస్తున్నాడు. ఆ డబ్బుల్తో పీకల్దాకా తాగి ఇంటా బైటా తాండవం చేసేస్తున్నాడు. రోజూ అమ్మా అయ్యా తిట్టుకుంటుంటే సుందరమ్మ భయం భయంగా ముడుచుకుని నిద్ర నటించేది.

మిట్టమధ్యాహ్నం ఎప్పుడో శివుడికి తెల్లారుతుంది. అయ్య లేచే సమయానికి వాళ్లూ వీళ్లూ ఇచ్చిన చద్దికూడు తెచ్చి వేడి చేసి పెడుతుంది సుందరమ్మ- వాడు తిన్నదేదో తింటాడు- మిగిల్తే తల్లీ కూతురు పంచుకుంటారు.

ఓరోజు అదే కథ జరుగుతుండగా..ఇంటిముందు పెద్ద గలాటా జరిగింది.

సోములుగాడు అనే 45 ఏళ్ల శివుడి సహ తాగుబోతు ఫుల్లుగా తాగి పెద్దగా పేల్తూ ఇంటికొచ్చాడు-

"నాకు పెళ్లెప్పుడు చేత్తావు మావా" అని శివుణ్ని నిలేశాడు.

"పెళ్లేంటి? మావా ఏంటి" సింతాలు బెంబేలు పడుతూ అడిగింది.

"నీకు తెలవదెహె..ఊరుకోయె..అత్తా- మావ తన కూతుర్నిచ్చి నాకు పెళ్లి సేత్తానని ఎయ్యి రూపాయలు ఎదురు సొమ్ము తీసుకున్నాడు. పిల్లనిచ్చేదెప్పుడంటే రేపు సెప్తా-మాపు సెప్తానంటా మొగం సాటేస్తన్నాడు-" అన్నాడు సోములు.

సింతాలూ సుందరమ్మా వణికిపోయారు-

"ఏంది మావా? లగ్గం ఎప్పుడో ఇయ్యాలే తేలాల" అన్నాడు సోములు.

"సెప్తా- పంతులుగారి దగ్గరకి ఎల్లాలిగా" అన్నాడు శివుడు.

"ఈ ఎదవ ఇద్దరు పెళ్లాల్ని పొట్టనెట్టుకున్నాడు. ఆడితో మన పిల్లకి పెళ్లా" అంటూ గగ్గోలు పెట్టి గోలగోల చేసింది సింతాలు-

శివుడు పెళ్లాన్ని గయ్యిమంటూ చెయ్యెత్తి...నోరు మూయించాడు.

"లగ్గం ఎట్టించుకొద్దాం-పద అల్లుడూ.." అంటూ కదిలాడు- సోములు చెయ్యట్టుకుని.

"ఆడితో నీకు పెళ్లేంటే..సెర్లోపడి సావు..వద్దు..సావకు- ఆ ఇసాలచ్చమ్మగారింటికాడ దాక్కో..ఈడకి రావద్దు.. ఎల్లవే..ఎల్లిపో.. ఎక్కడున్నా సల్లగుండు" అంటూ ఓపిక తెచ్చుకుని కూతుర్ని తోలేసింది సింతాలు.

"అయ్య నిన్ను సంపేస్తాడే" వెనొక్కొచ్చి ప్రేమ కురిపించింది సుందరమ్మ-

"సస్తే సత్తాన్లేవే. నే బతికున్నా నిన్ను బతికించుకోగల్నా?? ఎల్లవే ఎల్లు-ఎల్లిపో" అంది సింతాలు-

సుందరమ్మ అమ్మ చెప్పినట్లు విశాలాక్షి ఇంటికి పరిగెట్టింది.

**ఫేనుకింద పడక- నీడపట్టున విశ్రాంతి. సుందరమ్మ కథ మారింది. వారం రోజుల్లోనే పెళ్లికూతుర్లా తయారైంది.**

* * *

చీకటి పడే వేళకి సోముగాడితో కల్సి శివుడు ఇంటికొచ్చాడు- ఇద్దరూ తాగినంత తాగి తలో సీసా తీసుకొచ్చారు!

"సుందూ..సుందూ" శివుడు బైటనుంచే అరిచాడు.

జవాబు రాలేదు. లోపలికెళ్లాడు. సింతాల్ని చూస్తూ-

"సుందేది?" మత్తుగా అరిచాడు.

"అది లేదు..ఏడకో ఏడుస్తూ పోయింది. నిన్నూ నీ అల్లుణ్నీ సూసి బయమేసి పారిపోయింది" బింకంగా చెప్పింది సింతాలు.

"అత్తే దాసుంటది మావా- నాలుగు తగిలిత్తే అజా పజా తెల్సిపోద్ది" సోములు బైటనుంచే పేలాడు-

శివుడు రెచ్చిపోయాడు- సింతాలు జుట్టుతో, చెంపల్తో, పీకతో రాక్షసంగా ప్రవర్తించి నిజం కక్కించే ప్రయత్నం చేశాడు-

ప్రాణం గిలగిల్లాడుతుండగా "ఇ..సా..ల..చ్చ..మ్మ.. గా..రిం..టికి.. ఎల్లిందేమో..నాకేటీ తెలీదు" అని భోరుమంది సింతాలు- ఛావలేక నిజం వొప్పుకుంది!

"సీ.." అంటూ వెళ్లిపోతూ ముఖం మీద వేసిన ఉమ్మిని కూడా తుడుచుకోకుండా కూతురి క్షేమం కోసం తల్లడిల్లిందా కన్నతల్లి!

* * *

విశాలాక్షి సుందరమ్మ కథ విని, కన్నీళ్లు తుడిచింది-

"నువ్వింక ఇంటికెళ్లద్దు- ఇక్కడే వుండు ఏడవకు" అంటూ అక్కున జేర్చుకుంది. అంత ప్రేమ తట్టుకోలేకేమో సుందరమ్మ మరింత ఏడిచేసింది.

"మీ అయ్య వొచ్చినా నిన్ను పంపించను. ఏడవకు. నేనున్నానుగా ఏం భయం లేదు..ఊరుకో- మొహం కడుక్కో పో" అని నీళ్ల గదిలోకి తీసుకెళ్లింది.

సుందరమ్మ మొహం కడుక్కుని తెరిపినపడింది.

అనుకున్నట్లుగా..సోములూ శివుడూ విశాలాక్షి ఇంటిముందుకొచ్చారు. నానాగొడవా జరిగింది! సుందరమ్మ బిక్కుబిక్కుమంటూ విశాలాక్షి వెనక్కాలే నక్కి వుంది.

"ఆ వెయ్యి రూపాయలు నేనిస్తా- ఆ పిల్లని వదిలెయ్యి" అంది విశాలాక్షి- సోములు బేరాలు మొదలెట్టాడు. పదిహేను వందలకి పెంచాడు- విశాలాక్షి సొమ్ము ఇచ్చి పొమ్మంది! 'ఇంక పాప మీ ఇంటికి రాదని' శివుడితో కరాఖండీగా చెప్పేసింది.

"మరి దానికి పెళ్లి సెయ్యాల్నేను-" అన్నాడు శివుడు-

"నేను చేస్తా నీకు సంబంధం లేదు" అని అతన్ని పంపేసింది విశాలాక్షి.

* * *

ఫేనుకింద పడక- నీడపట్టున విశ్రాంతి. సుందరమ్మ కథ మారింది. వారం రోజుల్లోనే పెళ్లికూతుర్లా తయారైంది. విశాలాక్షి రిక్షా తొక్కే రాములుకి కబురెట్టింది. అతనికి రిక్షా కొనడానికి డబ్బు సాయం చేసింది కూడా ఆమే...రాములు సుందరికి ఈడైన జోడని నిర్ణయించుకుంది. రాములుకి కూడా పెళ్లికూతురు నచ్చింది. ఇద్దరికీ సొంత డబ్బుల్తో పెళ్లి చేసింది. సింతాలూ శివుడూ కూడా చుట్టపుచూపుగా వచ్చి కూతురి పెళ్లిని చూసి సంబరపడ్డారు.

రాముల్తో కాపురం పెట్టిన కొన్నాళ్లకి సుందరమ్మ వచ్చింది. విశాలాక్షి ఆత్మీయంగా కుశలప్రశ్నలేసింది.

"మనిషి మంచాడేగానమ్మా- ఫేను ఉంటే బాగుణ్ను.. రేడియో కావాల్నా అనీ..మీయమ్మని అడుక్కురా అని రోజూ సతాయిస్తాడు" అని కన్నీళ్లెట్టుకు చెప్పింది.

విశాలాక్షి ప్రాణం చివుక్కుమంది.

"మాయమ్మ కాడికెళ్లి అడిగినా ఏవుంటది- నేనెళ్లిన కాణ్నుంచి ఆళ్లూ ఇల్లూ ఇంత ముద్దపడేస్తే తింటందిట- అట్టాటి దాన్నెళ్లి ఈడు ఇట్టా అడిగాడని ఎట్టా సెప్తా" అని ఏడిచింది.

"సర్లే నేను ఆలోచిస్తాలే" అంటూ ఓదార్చి సుందరికి పసుపూ కుంకం రైకల గుడ్డా ఇచ్చి సాగనంపింది.

ఆ సాయంత్రం రాములుకి కబురెట్టింది.

"కాపురం చల్లగా ఉండాలంటే ఇంటాడదాని కంట నీరెట్టించకూడదురా? నీకు ఫేనూ రేడియో కావాలంటే నాకు చెప్పాల్సింది. నేనిచ్చేదాన్నికదా- దాన్ని బాధపెట్టకు. ఇప్పటికే..అది చాలా బాధలు పడిపోయిందిరా" అంది విశాలాక్షి.

రాములు నోట్లోంచి మాటరాలేదు. తలొంచుకుని మౌనంగా వెళ్లిపోయాడు-

ఇంటికెళ్లి భార్యని ఛెళ్లున కొట్టాడు-

"నేను నిన్ను ఫేనూ రేడియో కావాలని సతాయించానా"

"లేదు"

"మరెందుకు ఆవిడతో అలా చెప్పావ్? ఎందుకడిగావ్?" గొంతు చిరిగిపోయేలా అరిచాడు.

"ఆవిడకి బోలెడ్డబ్బుంది- పిల్లాజెల్లా ముందు వెనకా లేరు..కట్టుకుపోద్దా సొమ్మంతా అనీ..నేనే అడిగాను-" అంది సుందరి.

తల తిరిగిపోయింది రాములుకి-

బరబర ఈడ్చుకుంటున్నట్లుగా విశాలాక్షి ఇంటిముందుకు లాక్కొచ్చాడు.

విషయం చెప్పించాడు

విశాలాక్షి నిర్ఘాంతపోయింది.

చాలారోజులు విశాలాక్షి సుందరి ద్రోహాన్ని మర్చిపోలేకపోయింది.

మనిషి నైజమే అంతేమో అని సరిపెట్టుకోలేకనూ పోయింది.

*

